

# నీళ్ళులేని ఊరు

పుల్లయ్య గారికి పిచ్చి కుదిరిందని తెలిసి ఒకసారి చూచి వద్దామని వెళ్ళాను. ఈ పుల్లయ్య కేవలం కల్పిత పాత్ర, ఎవరినీ ఉద్దేశించి వ్రాసినది కాదు అని వ్రాసుకోవటంతోనే, ఇందులో ఏదో కిటుకు వుందని, ఎవరా యీ పుల్లయ్య లాంటివాడు అనీ, అన్వేషణకు బయలుదేరటం కూడా కద్దు. అదేం కాదు అని మళ్ళీ వ్రాసుకున్నా ఎవరికీ నమ్మకం కుదరదు. మరి ఈ పుల్లయ్య ఎవరయ్యా అంటే ఒకాయన వున్నాడు. అయితే యీ పేరుతో కాదు. ఆయన అసలు పేరు వెంకట్రామయ్య. ఏదో కూరగాయల దుకాణం పెట్టుకుని గుట్టుగా కాలం వెళ్ళదీస్తున్నాడు. ఆయన పేరు చెప్పటం ఎందుకని పుల్లయ్య అనే పేరు పెట్టుకోవలసి వచ్చిందీ కథలో.... 1

ఆయనకు పిచ్చి కుదిరింది అని విన్నదాకా ఆయనకు పిచ్చి వున్నమాటే గుర్తులేదు. చాలాకాలం క్రిందట తటస్థపడ్డ మనిషి గురించిన జ్ఞాపకాలు అన్నీ మరుగున పడిపోయినాయి. ఆయనకు పెళ్ళి అయిన తరవాతనే పిచ్చి రావటం వలన ఆస్పత్రిలో చేర్చక తప్పలేదు. మరింకో వైద్యం కాదాయే.

పిచ్చిగూడా అంత అకారణంగా రాలేదు. ఆయనకో అబ్బాయి వున్నాడు. ఆయన్ని గురించిన దిగులుతో ఈయనకు మతి చలించిందని అంతా అనుకునేమాట.

వాళ్ళబ్బాయి, ఒక ఆఫీసులో చిన్న ఉద్యోగం చేస్తూ ఏదో సందర్భంగా పై అధికారితో దెబ్బలాడాడట- దానికయినా పెద్ద కారణాలు లేవు. ఆఫీసు పది గంటల కయితే పొద్దున్నే

ఎనిమిది గంటలకే రమ్మని ఆ అధికారిగారు అడిగితే ఆ అబ్బాయి తన వాక్స్వాతంత్ర్యాన్ని ఉపయోగించాడట! నేనేం నీ యింటి నౌకరు నేమిటి? నువ్వెంతో నేనూ అంతే. గవర్నమెంటు నౌకరుని.. అన్నాడుట. అది బయటవారికి తెలిసిన మాట. లోపల ఏదో బాగానే కీచులాడుకున్నారుట. ఆ అబ్బాయి తన వాదనకు బలం కోసం రాజ్యాంగంలోని కొన్ని నిబధనలను ఏవో తెచ్చి చూపించాడని కూడా అంటారు.

కోపం వలన కొన్ని యిబ్బందులున్నాయని అనుకున్న అధికారి గారు, కొంచెం శాంతించి 'నాయనా నువ్వింకా చిన్నవాడివి (ఇరవై యేళ్లు దాటాయి లెండి) మనమంతా గూడా గవర్నమెంటుకు ఇతోధికంగా సేవ చేయాల్సిన బాధ్యత మనమీద ఉంది అని ఎంతో అనునయంగా చెప్పి వప్పించాలని కుదరక విసిగి వేసారిపోయాడు.

"సామదాన భేద దండోపాయాలని అంటారు గదా వాటిని ఎందుకు ప్రయత్నించ కూడదు? అనుకుని అవన్నీ గూడా చూశాడు. ఆఖరికి ఆ అబ్బాయి "నువ్వు చేసేదేమిటో చేసుకో!" అని మామూలు మర్యాదనన్నా పాటించకుండా ముఖాన అనేశాడు ఆ అధికారికి వొళ్లు మండిపోయింది.

"నిన్ను నీళ్ళు లేని వూళ్లోకి బదిలీ చేయిస్తాను జాగ్రత్త...." అని ఆ రోజున బెదరించి మర్నాడు బదిలీ చేయించాడు.

అయినా మాట నిలబెట్టుకోలేక పోయాడు. ఆ వూళ్లో నీళ్లున్నాయి. అయితేనేం వుప్పగా వుంటాయి. అడివి ప్రదేశం. ఎలుగ్గొడ్లు, పెద్దపులులు మామూలుగా యింట్లో కుక్కలూ, పిల్లులూ తిరిగినట్లు తిరుగుతాయి. అక్కడి బావులు దిగుడు బావుల్లాగా వున్నాయి. ఆ పులులు కూడా అక్కడే నీళ్లు తాగుతాయి. అవి తాగి పోయిన మీదట మనుష్యులెవరన్నా ధైర్యంచేసి అక్కడికి పోవాలి. ఆ నీళ్లు బాగా వుప్పగా వుంటాయి. పచ్చి మామిడికాయ ముక్కలు ఆ నీళ్లలో ఒకసారి ముంచి నోట్లో వేసుకుంటే కమ్మగా వుంటుందిట!.

అక్కడ వచ్చిన జీతం అంతా ఆదాయం క్రింద లెక్క. అక్కడ అమ్మేవాళ్లూ, కొనేవాళ్లూ అంటూ లేరు. హోటళ్లు లేవు. సినిమా హాళ్లుగానీ, ఉద్యానవనాలు గానీ లేవు. మరి భోజనం ఎలాగంటే దానికి చాలా గొడవలున్నాయి. ప్రకృతి వైద్యం చేయించుకునే వాళ్లలాగ బ్రతకాలి. రాత్రి మంచెమీద పడుకోవాలి. కింద ఎలుగొడ్లు, చిరుత పులులు తిరుగుతూ వుంటాయి. నరవాసన చూసి మంచెకింద నుంచి వెళ్లిపోతుంటాయి. ఎలుగొడ్లు చెట్లెక్కుతాయంటారు. కాని ఈ మంచెలు ఎక్కటం చేత అయినట్లు కనబడదు. సన్నటి వాసాల మీద ఎత్తుగా కడతారు మంచె. అయితే మనుష్యులు నిచ్చెన వేసుకుని ఎక్కి తరవాత నిచ్చెనను క్రిందకు తోసేస్తారుట మరి నిచ్చెన లేకుండా దిగటం ఎట్లాగో తెలియదు.

ఈ ఇబ్బందులన్నీ విన్న తరువాత పుల్లయ్య ముందర చెప్పులరిగేట్టు, తరువాత కాళ్లు అరిగేట్లు వాళ్లచుట్టూ, వీళ్ల చుట్టూ తిరిగి మతిపోగొట్టుకున్నాడు. అబ్బాయిని ఎట్లాగయినా బదిలీ చేయించి మళ్లీ నగరానికి తీసుకురావాలి అని తల్లి నానా గందరగోళం చేసింది. అయినా దురదృష్టం కాకపోతే ఈ ఉద్యోగం ఏమిటి చెప్పండి. పాపం మెట్రిక్యులేషను దాకా చదివాడు. తప్పాడంటే అది వేరే సంగతి. ఆ మాటకొస్తే ఎంతమంది తప్పటం లేదుగనక. జాగ్రత్తగా ఏ యూనివర్సిటీ వాళ్ళదగ్గరికన్నా పోయి లెక్కలు తీస్తే మన దేశంలో ఈ యింగ్లీషు చదువులు

వచ్చిం తర్వాత పరిక్షలు ప్యాసయిన వాళ్లకంటె తప్పిన వాళ్ల సంఖ్య ఎప్పుడూ ఎక్కువ వుంటూ వచ్చింది. నలుగురితోపాటు నారాయణా.

ఆ అబ్బాయికి కూడా ఏదో పేరు వుంది కాని, నాకయితే బాగా తెలియదు. అక్కడ పడే యిబ్బందులు అవీ ఇవీ అని గాదు. ఆఫీసుపని పెద్ద కష్టం ఏమీ కాదు. మనశ్శాంతి లేదు, తిండిలేదు, నిద్రలేదు. ఇతర వ్యక్తుల సాంగత్యం లేదు. ఆడవాళ్లు అసలు ఆ చాయల్లోనే లేరు. నిద్రపోతే లేచేదాకా నమ్మకం లేదు. లేస్తే మళ్ళీ పడుకునే దాకా రూఢీ లేదు. అంత దారుణంగా వుంటుంది అక్కడి స్థితి.

అధికారి గారితో దెబ్బలాడినందుకు పశ్చాత్తాపపడ్డాడు. పెద్ద క్షమాపణ ఉత్తరం వ్రాసి పంపించాడు. ఆయన క్షమించే పక్షంలో అక్కడనే వుండిపోవటం మినహా- ఏ పనయినా చేస్తానని వ్రాశాడు. ఆ ఉత్తరం తీసుకెళ్ళి అధికారికి చూపించాడు. ఎంతమందో సిఫారసు చేశారు. ఆ పసివాడిని అలా బాధ పెట్టి ఉసురు ఎందుకు పడతావు అని నచ్చచెప్పారు.

అధికారి గూడా అందరిలాంటి వాడే గాబట్టి "అబ్బాయికి బుద్ధిరావాలనే గాని, నాకేమన్నా కోపమా!" అని ఆశ్చర్యం, జాలి, సానుభూతి, విచారం- ఇత్యాది పదజాలాలలో వుండే సారం అతని ముఖంలో కనబరిచి ఆ అబ్బాయిని మళ్లీ నగరానికి బదిలీ చేయించాడు.

పుల్లయ్య పిచ్చిలాంటిది కుదిరింది. ఆ అబ్బాయి తల్లి అంటే పుల్లయ్య భార్య ఆరోజున ఎంతో సంతోషించి కొడుకుని కావలించుకుని అతని కిష్టమయిన పిండివంటలన్నీ చేసిపెట్టింది.

అదంతా బాగానే వుంది కాని, ఆ అబ్బాయి చోటులో ఉద్యోగం చేయటానికి ఇంకెవరో పరిచయం లేని అబ్బాయిని బదిలీ చెయ్యవలసి వచ్చింది. అతనికీ తల్లి తండ్రీ వుండి వుంటారు. అతనూ మెట్రిక్యులేషను తప్పి వుండవచ్చు. అతను ఈ అవస్థలన్నీ పడాల్సిందే మరి. పుల్లయ్యకు ఆ సంగతి తెలియనే తెలియదు.

**"అంతర్మాతకు అసత్యంగా ఉండే బదులు లోకానికి అసత్యంగా వున్నట్లు కనబడటం లక్షరెట్లు ఉత్తమం... శస్త్రయుద్ధమొనరించి జగత్తును జయించుటకంటె మనోవికారాలను జయించుట కష్టం".**